# అవసరంలేని ఆపరేషన్

"ఆ బాణ సంచా అడావిడి యేమిటి?"

"టీ పార్టీ"

"యెవరికి?"

"యీవూరు ఆడ డాక్టరికి బదిలీ అయింది"

"యింత అడావిడా?"

"యీ వూరిప్రజలకి ఆమెని చూస్తే అత్యంతాభిమానం"

"యెందుకు?"

"ఐదేళ్లలోనూ వాళ్ళవి పదివేలరూపాయలు బ్యాంకిలో వేసుకుంది. అందుకని.

"అంత తెలివిగలదా?"

"అదేమో! మొదటి సంవత్సరం ఆమె మొహం చూసినవాడు లేడు. కాని జూలైలో గావును ఒక విచిత్రమైన కేసు కుదిర్చింది. దాంతో ఆమె ప్రభ అద్వితీయంగా వెలిగింది, యీ నాలుగేళ్ళూ"

"యేం కేసేమిటి?"

"అదే తమాషా, అందులో ఈమె ప్రయోజకత్వ యేమీలేదు. కీర్తి మాత్రం యీమెకి టక్కింది. వాళ్ళు మాకు బంధువులే. చెప్పనా? ఆమెకి ముప్ఫైయేళ్ళు-"

"డాక్టరుకా?"

"కాదు. మా బంధువురా లొకామెకి. ఆమెకి పిల్లలు లేరు. పిల్లలు లేకపోతే బతకడమెందుకనే మనోవ్యాధి పట్టుకుందామెకి. యింక బిడ్డల కోసం వాళ్ళుపడ్డ శ్రమా, చేసిన ప్రయత్నాలూ యిన్నన్నికాదు. యెన్ని మందులో, యెన్ని యాత్రలో, యెన్ని విధాలైన ప్రదక్షిణాలో, యెంతమంది బైరాగులకీ, సన్యాసులకీ బహుమతులో! యేమీ లాభంలేక, విసుగెత్తి రోజూ ప్రతివారితో తన కథ చెప్పుకుని యేడుస్తూ పడివుంది. చిన్నదానివింకా నీకింతతొందరేమిటి, నిరాశ యేమిటంటే వినదు. చివరికి ఒక పిల్లాణ్ణితెచ్చి పెంచుకుంటే, వాడు యీమె ముద్దులు భరించలేక పారిపోయినాడు. తరవాత చెన్నపట్నం నుంచి పెద్ద బొమ్మ నొకదాన్ని తెచ్చుకుంది. ఆ బొమ్మకి పాలిచ్చీ, ముద్దాడీ, నీళ్ళుపోసీ చొక్కాలు తొడిగీ, అది చేతులూ కాళ్ళాడించాలనీ, యేడవాలనీ, మాట్లడాలనీ, ఆమెచేసే ప్రయత్నం, చూస్తే అందరికీ అమితమైన జాలి కలిగేది. మా బంధువుల్లో పిల్లలులేని దరిద్రులెవరూలేరు

కనుక యీమె సిగ్గుపడి, పిల్లలులేని పాపం చేసినట్లు యే కార్యాలకీ యెక్కడకీ వెళ్ళడం మానేసింది. యెవరు తన ఇంటికి వచ్చినా, వాళ్ళు తనని హేళనచేస్తున్నారే అనుకుంది. పిల్లలకోసం యీమె చెయ్యడానికి నిరాకరించే పనివుందా అనిపించేది. యింతలో ఆ వూరొక స్వాములార్ల మీది గొప్ప స్వాములవారు వొచ్చారు. గొడ్రాళ్ళకి పిల్లలు పుట్టించడంలో ఆయన బహునేర్పరి. గుంపులు గుంపులుగా ఆడవాళ్ళాయిన్ని దర్శించి కృతార్థు లౌతున్నారు. ఒక్క వితంతువులు మాత్రం, ఆయన గాలి తగిలితే, తమకే వుపద్రవం కలుగుతుందో అని దూరాన తప్పుకొంటున్నారు. సరే యీమె ఆయన దర్శనానికి వెళ్ళింది. పదిహేను రోజులలో గర్భిణి చిన్నాలు కనపడ్డాయి. వేవిళ్ళు మొదలైన సంగతులన్నీ సక్రమంగా జరిగాయి. యింక వుత్సవాలేమిటి? సూడిదలూ, వొచ్చే బంధువులూ, పోయే బంధువులూ, పదినెలలూ ఒకటే గొడవగా గడిచింది. పది నెలలూ దాటాయి; కనలేదు. సంవత్సరమయింది కడుపు అట్లానే వుంది. వాళ్ళకి బయమేసి యీ డాక్టరు దగ్గిరికి తీసుకొచ్చి చూపారు. ఆమె పరీక్షచేసి అది కడుపుకాదని రూఢిగా చెప్పింది. ఆ మాట వినగానే పాపం యీ పిల్ల మూర్ఛపోయింది. బంధువులంతా గొల్లుమని యేడ్చారు. వారంరోజులు మందిచ్చేటప్పటికల్లా పొట్టకాస్తా కరిగిపోయింది. ఇట్లా పదినెల్ల గర్భిణీని, వారం రోజుల్లో మాయంచెయ్య శక్తి గలిగిన డాక్టరు తిరిగి దాన్ని నిజంగా రప్పించలేదా అనే గట్టి విశ్వాసం వాళ్ళకు కుదిరింది. ఆమె తనకి చాతకాదు, పొమ్మన్నావాళ్ళు కదలలేదు. ఒకరోజు రాత్రి యీమె పోయి డాక్టరు కాళ్ళమీదపడి బతిమాలుకుని తనకి సంతానం కలిగిస్తే పదిహేను వందల కాసులపేరు యిచ్చేస్తానంది.

ఈ డాక్టరు భర్త బి.య్యే. పాసై ఎండకాలపు శలవలకి యీమె యింటో వున్నాడు. ఒకరోజు భార్య ఆస్పత్రికి వెళ్ళినప్పుడు యీ అమ్మాయివొస్తే నవ్వి చెయ్యి పట్టుకుని దగ్గిరికి లాక్కున్నాడు. ఈ అమ్మాయి చాల పూర్వాచారపరాయణురాలు, దైవభక్తిలో, భర్తసేవలో, పెరిగిన మనిషి, పరపురుషుల ధ్యానం యింతవర కెరగదు. అట్లాంటిది బలవంతంగా తటస్థించినా చాల ఘోరపాపమని జంకుతుంది. అతనిపైని గౌరవంచాతా, భయంచాతా, యేం అనకపోయినా అతన్నించి తప్పించుకుని, ఒక్కమాట మాట్లాడకండా వెళ్ళిపోయింది. మళ్ళీ వొంటరిగా ఆ యింటికి వెళ్ళలేదు. కాని అతనికి మాత్రం ఈమెమీది మమకారం యే మాత్రమూ వదలలేదు.

మర్నాడు ఆపరేషను నిశ్చయమైంది. ఆ సాయంత్రం ఆ అమ్మాయి భయంతో డాక్టరింటో యేడుస్తో కూచుంది. తన భార్య పక్కగదిలోకి వెళ్ళినప్పుడు ఈమెతో "వూరికే యేడవకు - ఈ డాక్టర్ల కేం తెలుసు - ఈ ఆపరేషన్ లేకుండా అనేక మందులున్నాయి - మళయాళంలో కాశ్మీరంలో అనేక క్రియలున్నాయి- అవి నాకు తెలుసు- డాక్టరాస్పత్రికి వెళ్ళిం తరవాత రా చెపుతాను'' అన్నాడతను - ముందు వేళాకోళ మనుకుంది. కాని ఆలోచించగా, ఒకవేళ అతనికేధన్నా మంత్రం తెలిసివుండకూడదా అని తట్టింది. ఆపరేషనంటే

ఆమెకున్న మహాభయమూ, బిడ్డమీద ఆపేక్షా ఆమె విశ్వాసాన్ని మరింత బలపరిచాయి ఇంటికివెళ్ళి భర్తతో చెపితే, తప్పకుండా వెళ్ళి కనుక్కోమన్నాడు - ఆమె రాగానే, డాక్టరు భర్త కూచోపెట్టి ఈ సంగతులు మాట్లాడాడు.

"ఈ పిల్లలు పుట్టుకుపోవడము, నీ లోపమూ కాదు, నీ పూర్వజన్మ లోపమూ కాదు. దేవుడికి నీమీద అగ్రహమూ కాదు- లోకంలో గడ్డి పరకలకి వెయ్యిగింజలూ, ఈగలకి లక్షగుడ్లూ ప్రసాదించే ఈశ్వరుడు నిన్ను గొడ్రాలి చెయ్యాలని వుద్దేశ్యపడతాడా? లోకమంతా జననీ ప్రేమతో మోగిపోతూవుంటే "బిడ్డో!" అని యేడ్చే నీకు బిడ్డలు లేక పోవడమేమిటి. పోనీ, నీ దేహంలో రుగ్మతవుందా? యే మూలాలేదు. కోపం తెచ్చుకోకు, లోపమంతా నీ భర్తది. ఆయన వంశంలో పిల్లలు ఎక్కువమంది వుండరు-అవునా?"

"మరి ఆయనకి ఆపరేషన్ చెయ్యాలా?"

"లాభం లేదు."

"ఐతే యెట్లా ?"

"యెట్లానూ లేదు"

"ఏదో చెపుతామన్నారు, మరి !"

"మరి చెపితే కోపం తెచ్చుకోవుకద!"

"చెప్పండి"

"నీకు ఆవు వుందనుకో, దానికి దూడ కావాలి. ఒక యెద్దుదగ్గిర యెదకాకపోతే ఏంచేస్తారు?" సిగ్గుతో మాట్లాడలేదు.

"చెప్పుమరి! యింకో యెద్దు దగ్గిరికి తోల్తారు అంతే."

మాట్లాడకండా కూర్చుంది స్తంభించిపోయి.

"నేను చెప్పేమాట విను. నీకు పిల్లలంటే వెర్రి. పిల్లలులేకుండా బతకలేవు. గంపెడు పిల్లల్ని కడుపారా కనేందుకూ నిన్నూ నీ శరీరాన్నీ, నీ మాతృ హృదయాన్నీ సృష్టి ఏర్పరచింది. అందుకే యీ బాధ. నీకు పిల్లలూ, వారిమీద ప్రేమా, స్త్రీకి జన్మహక్కు; సహజం. అవే స్త్రీ జీవితానికి మకుటాలు. అవిలేక జీవితం శుష్కం, అర్థవిహీనం. అందుకనే, యెంత అణచుకుందామని ప్రయత్నించినా అణగని బాధ నీకు. యిక ముందు యింకా బాధపడతావు. ఈ యాత్రలూ, మంత్రాలూ, అపరేషన్లూ యేంలాభం ? ఆయన్ని మార్చవు కదా ?"

"ఆయనకేమీ జబ్బులేదే ?"

"లేదు. కాని యిదే జబ్బు."

"యేది ?"

"నీకూ ఆయనకీ జత కుదరలేదు."

"ఐతే."

"జత కుదుర్చుకోవాలి."

"అంటే ?"

"వేరే పెళ్ళిచేసుకోవాలి"

'ఆయన చేసుకునేంలాభం ?"

"ఆయనకాదు నువ్వు."

"నేనా ? పెళ్ళా ?"

"పెళ్ళంటే పల్లకీలో వూరేగడం కాదు. యింకో భర్తని బిడ్డలకోసం మాత్రం-" మధ్యనే "పోండి" అని లేచింది.

"ఆ కోపమే వొద్దన్నాను. బిడ్డల్ని యెత్తుకోకండా, ఆడించకండా వాళ్ళ ముద్దులు చూడకండా వుండగలవా ? వెళ్ళకు. ఒక్కమాట విను. మా అబ్బాయిని చూశావుగా అట్లాంటివాడు పుడితే ! మేము సంతానాలకి ప్రసిద్ధి. మా గాలి సోకితే చాలు. మేము పన్నెండుగురం మా తల్లికి. మాలో ఒక్కొక్కరికి నలుగురు పిల్లలకన్న తక్కువలేరు."

వెళ్ళిపోయి, రాత్రంతా ఆలోచించుకుంది. మర్నాడు సాయింత్రం డాక్టరు భర్త టెన్నిసుకి వెడుతో వుండగా, ఆమె గుమ్మంలో సిగ్గుతో ఎదురుయ్యింది. ఆ సాయింత్రానికి ఆమెతో ఇంటోనే వుండిపోయినాడు.......

ఆమె ఆపరేషన్ మానేసి తన వూరు వెళ్ళింది, మూడురోజుల తరువాత. యేడాదైన తరవాత చక్కని పాపాయి నెత్తుకుని వొచ్చింది, డాక్టరు దగ్గిరికి-ఆ అమ్మాయి భర్త చాలా సంతోషంతో, గర్వంగా - "ఆపరేషన్లన్నారు. ఒక వంద వొదిలేవి! యేమి లేకండానే యెట్లాంటి పిల్లవాడు కలిగాడో? ఈశ్వరుడి దయవుంటే యామన్నా జరుగుతుంది" అన్నాడు.

డాక్టరు, భర్తని పిలిచింది. "చిన్నప్పుడు మన పెద్దబ్బాయి అచ్చు యిట్లా వుండే వాడు కదూ ?" అంది.

డాక్టరుకి ఆ అమ్మాయి భర్త ఒక చీర యిచ్చాడు. డాక్టరు భర్తకి బంగారపు వాచీ గొలుసూ యిచ్చింది, ఆ అమ్మాయి. అప్పణ్ణించి ఈమె కీర్తి దివ్యంగా వెలిగింది.

◆ ◆ ◆

*ప్రచురణ : (చలం కథలు సంపుటం 1), దేశీకవితామండలి, 1956*